


నేడు సిపిఎం రాష్ట్ర మహిళా సదస్సు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర మహిళా సదస్సు జరగనుంది. తిరుపతి టిఎంఆర్ కల్యాణ మండపంలో శనివారం ఉదయం 10 గంటలకు జిల్లా కమిటి సభ్యురాలు పి.సాయిలక్ష్మి అధ్యక్షతన ఈ సదస్సు ప్రారంభమవుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ మహిళల పట్ల తీవ్రమైన అణచివేత, హింస, అసమానతలు కొనసాగుతున్నాయని, రాష్ట్రంలోని మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాస్త్రీయమైన పరిష్కారాలు చూపడం కోసం సిపిఎం ప్రత్యామ్నాయ విధానాలను చర్చించనున్నదని తెలిపారు. ఈ సదస్సుకు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు మరియం దావలె, సామాజికవేత్త కె.వసుంధర, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి, కె.సుబ్బరావమ్మ, మూలం రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ధనలక్ష్మి, వామపక్ష పార్టీల జిల్లా కార్యదర్శులు పి.మురళి, ఆర్.హరిక్రిష్ణ, వందవాసి నాగరాజు పాల్గొంటారని తెలిపారు.

నేడు శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబరు 15 నుండి 23వ తేదీ వరకు జరగనున్నాయి. ఇందుకోసం అక్టోబరు 14న అంకురార్పణ నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో ఉదయం 8 నుండి 10 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహనసేవలు జరుగుతాయి. గరుడవాహనసేవ రాత్రి 6.30 గంటలకు ప్రారంభం కానుంది. శనివారం రాత్రి 7 నుండి 8 గంటల వరకు శాస్త్రోక్తంగా అంకురార్పణం జరగనుంది. వైఖానస ఆగమంలోని క్రతువుల్లో అంకురార్పణం లేదా బీజవాపనం అత్యంత ముఖ్యమైనది. ఏదైనా ఉత్సవం నిర్వహించే ముందు అది విజయవంతం కావాలని కోరుతూ స్వామివారిని ప్రార్థించేందుకు అంకురార్పణం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా శ్రీవారి తరపున సేనాధిపతి అయిన శ్రీ విష్వక్సేనులవారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపుగా వెళ్లి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తారు. అనంతరం అంకురార్పణ కార్యక్రమాల్లో భాగంగా ఆలయంలో భూమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్టమన్నులో నవధాన్యాలను నాటుతారు. నవధాన్యాలకు మొలకలొచ్చేవరకు నీరు పోస్తారు. అంకురాలను ఆరోపింపజేసే కార్యక్రమం కాబట్టి ఇది అంకురార్పణం అయింది. అంకురార్పణ ఘట్టం తరువాత రంగనాయకుల మండపంలో ఆస్థానం నిర్వహిస్తారు. అంకురార్పణం అంటే విత్తనం మొలకెత్తడం. బ్రహ్మోత్సవాల తొలిరోజు అక్టోబరు 15న ఉదయం 9 నుండి 11 గంటల వరకు బంగారు తిరుచ్చి ఉత్సవం, రాత్రి 7 నుండి 9 గంటల వరకు పెద్దశేష వాహనసేవ నిర్వహిస్తారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం



విద్యుత్ చార్జీలు తగ్గించాలి

వామపక్షాల ధర్నా

ప్రజాశక్తి - గూడూరు టౌన్

రాష్ట్ర ప్రభుత్వం అనేక పేర్లతో విద్యుత్ చార్జీలను విపరీతంగా పెంచిందని, దీని వలన పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం నాయకులు జోగి శివకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీల ధరలు తగ్గించాలని గూడూరు పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం , సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జోగి శివకుమార్, సిపిఐ నాయకులు ప్రభాకర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఎస్సీ ఎస్టీల వారికి ఉచిత కరెంటు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు కేవలం కాలనీగా ఉంటేనే ఇస్తామని, అనేక మంది పేదవారికి ఉచిత విద్యుత్ కట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్ చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలు పెంచి పేద ప్రజల నడ్డి విరుస్తున్నారని అన్నారు. ఇకనైనా పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా వామపక్షాలు ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు వెంకట రామి రెడ్డి , సి.ఐ. టి.యు పట్టణ అధ్యక్షులు బి.వి.రమణయ్య , పట్టణ కార్యదర్శి సురేష్ , చంద్రయ్య , కోటి , కె.వి.పి. ఎస్ పట్టణ కార్యదర్శి అడపాల ప్రసాద్ , సీపీఐ నాయకులు శశి కుమార్ , ఎంబెటి చంద్రయ్య , రమేష్ పాల్గొన్నారు.

వ్యాపారుల సమస్యలు పరిష్కరించండి :కెవి చౌదరి

ప్రజాశక్తి-తిరుపతిటౌన్



వ్యాపారుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వెంకటరమణరెడ్డిని కలిసి కెవి చౌదరి ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలలో ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ అఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ రాయలసీమ జోన్, తిరుపతి జిల్లా ఛాంబర్ అఫ్ కామర్స్ అధ్యక్షులు కె. వి. చౌదరి ఆధ్వర్యములో తిరుపతి జిల్లాలోని పలు వ్యాపార సంఘాల ప్రతినిధులు తిరుపతి జిల్లా కలెక్టర్ ని మర్యాద పూర్వకముగా కలిసి సభ్య సంఘాలను జిల్లాలోని ముఖ్యమైన సలహా కమిటీలలో నియమించమని విన్నవించారు. దీనికి జిల్లా కలెక్టర్ ప్రతిపాదనలు ఇవ్వండి, పరిశీలించి నియమిస్తామని తెలియజేసారు. ఏపీ ఛాంబర్ రాయలసీమ జోన్ ఛైర్మన్ గా నియమితులైన కే.వి. చౌదరి ని కలెక్టర్ సన్మానించారు.ఈ కార్యక్రమంలో రాయలసీమ జోన్ వైస్ ఛైర్మన్ కొల్లి రఘురామిరెడ్డి , ఏపీ ఛాంబర్ రిటైల్ కమిటీ వైస్ ఛైర్మన్ పి. మధుసుధన్ రావు , ఏపీ ఛాంబర్ డైరెక్టర్ జె. రజితా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

15మంది ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)



రేణిగుంట ఆంజనేయపురం చెక్ పోస్టు, బాకరాపేట, రైల్వే కోడూరు పరిధిల్లోని మూడు ప్రాంతాల్లో 40ఎర్రచందనం దుంగలు, ఒక బొలేరో లగేజి వాహనం, రెండు కార్లు, రెండు మోటారు సైకిళ్లను టాస్క్‌ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి 15మంది స్మగ్లర్లను అరెస్టు చేశారు. డీఎస్పీలు మురళీధర్, చెంచుబాబు అధ్వర్యంలోని ఆర్‌ఐ సురేష్ కుమార్ రెడ్డి, కపానందలకు చెందిన మూడు టీమ్‌లు గురువారం కూంబింగ్, వాహనాల తనిఖీలు చేపట్టాయి. డీఎస్పీ చెంచుబాబు మాట్లాడుతూ మూడు సంఘటనల్లో మూడు టీమ్‌లు చాకచక్యంగా వ్యవహరించి ఎర్రచందనం దుంగలను పట్టుకోగలిగినట్లు తెలిపారు. ఎర్రచందనం దుంగలు టన్నుకు పైగా ఉన్నాయని తెలిపారు. వాహనాలతో కలపి వాటి విలువ సుమారు రూ. కోటి ఉండవచ్చునని పేర్కొన్నారు. ఆపరేషన్‌లో పాల్గొన్న టీమ్ లకు కర్నూలు రేంజి డీఐజీ, టాస్క్ ఫోర్సు ఇన్చార్జి సెంథిల్ కుమార్ రివార్డులు ప్రకటించినట్లు తెలిపారు. ఈ కేసులను సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐలు మహన్ నాయక్, రఫీలు దర్యాప్తు చేస్తున్నారు.

హర్యానా దొంగల ముఠా అరెస్ట్

ప్రజాశక్తి - తిరుపతి సిటి



ఎటిఎం దొంగతనాలకు పాల్పడుతున్న హర్యానా మేవాత్ గ్యాంగ్ నేరగాళ్ల ముఠాను శుక్రవారం అరెస్టు చేశారు. నేరగాళ్లు ఆరుగురితో పాటు, రెండు లారీలు, ఓ కారు, రెండు నాటు తుపాకులు, 21 కేజీల గంజాయి, గ్యాస్‌క ట్టర్లు, రెండు లక్షల నగదును వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. గతనెల 14న ధనలక్ష్మీనగర్‌లోని ఎస్‌బిఐ ఎటిఎంలో ఈ ముఠా దొంగతనానికి పాల్పడింది. ఛాలెంజ్‌గా తీసుకున్న చంద్రగిరి డిఎస్‌పి యశ్వంత్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యంరెడ్డి, రాజవేఖర్‌లు బృందాలుగా ఏర్పడి ఢిల్లీ, హర్యానా, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల్లో జల్లెడ పట్టారు. మేవాత్ గ్యాంగ్‌పై పై నాలుగు రాష్ట్రాల్లో 19 కేసులు ఉన్నాయి. ముఠాలో ప్రధాన ముద్దాయి సద్దాంఖాన్‌పై వివిధ రాష్ట్రాల్లో 23 కేసులు నమోదయ్యాయి. ఎపి, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల్లో గంజాయి తక్కువ రేటుకు కొనుగోలు చేసి హర్యానా రాష్ట్రంలో ఎక్కువ రేటుకు విక్రయించేవారు. ముఠాలోని ఇద్దరు సభ్యులు రహాడి సద్దాం, అమీర్‌ఖాన్‌లు పరారీలోఉన్నారు. వారిని త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న రూరల్ పోలీసులకు ఎస్‌పి పి.పరమేశ్వర్‌రెడ్డి రివార్డులు అందజేశారు.

లైంగిక వేధింపుల నిరోధక చట్టాన్ని...

పటిష్టంగా అమలు చేస్తాం : కలెక్టర్

ప్రభుత్వ, ప్రైవేట్‌రంగాల్లో అంతర్గత కమిటీలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

లైంగిక వేధింపుల నిరోధక చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తామని, నెలాఖరుకల్లా టిటిడి, ప్రభుత్వ విభాగాల్లోనూ, నవంబర్ ఆఖరికల్లా ప్రైవేట్‌రంగాలలో అంతర్గత కమిటీలు పూర్తి చేస్తామని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి అన్నారు. సిఐటియు చొరవతో కలెక్టరేట్‌లో శుక్రవారం లైంగిక వేధింపుల నిరోధక కమిటీ జిల్లాస్థాయి సమావేశం అన్ని విభాగాల అధికారులతో కలెక్టర్ ఆద్వర్యంలో నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జయంతి, సాయిలక్ష్మి, సిఐటియు నేతలు వాణీశ్రీ, బుజ్జి, హేమలత ప్రసంగించారు. జిల్లాలోని 82 విభాగాల్లో అంతర్గత కమిటీల ఊసేలేదని, ఈ కారణంగా శ్రామిక మహిళలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. జిల్లాలో పలుచోట్ల మహిళలపై జరిగిన లైంగిక వేధింపుల ఘటనను సోదాహరణంగా వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పని ప్రదేశాల్లో జరుగుతున్న లైంగిక వేధింపులను ఎదుర్కోడానికి లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013ను పటిష్టంగా అమలు చేస్తామన్నారు. అక్టోబర్ చివరి నాటికి టీటీడీ, జిల్లా కలెక్టర్ కార్యాలయంతో సహా జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలన్నింటిలో అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయాలని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జయలక్ష్మిని కలెక్టర్ ఆదేశించారు. శ్రామిక మహిళలు లైంగిక వేధింపులకు గురికాని జిల్లాగా తిరుపతి జిల్లాను మార్చుకుందామని ఆయన పిలుపునిచ్చారు. తాను ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేసినపుడు ఓ మండల స్థాయి అధికారిపై ఫిర్యాదు వచ్చిందని అంతర్గత కమిటీలు, స్థానిక కమిటీ లేకపోవడం వల్ల ఆ అధికారి చట్టంలోని లొసుగులను ఆధారం చేసుకుని, శిక్ష నుంచి తప్పించుకున్నాడని వివరించారు. తిరుపతి జిల్లాలో తప్పు చేసిన వారు అలా తప్పించుకోవడానికి వీల్లేని పద్ధతులను నిర్దేశిద్దామని అధికార యంత్రాంగానికి పిలుపునిచ్చారు. తన సర్వీసులో ఎదురైన అనేక ఇబ్బందులను వాటిపట్ల తాను వ్యవహరించిన తీరును కలెక్టర్ అధికారులకు వివరించారు. చట్టం పటిష్టంగా అమలు జరగకపోతే బాధితులకు న్యాయం జరగదని, చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడం కోసం స్థానిక కమిటీలను, అంతర్గత కమిటీలను బలోపేతం చేస్తామని అందుకు జిల్లాలోని అధికారులు అన్ని విభాగాల వారు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నవంబర్ నెలలో అన్ని షాపింగ్ మాల్స్ లో, పరిశ్రమలలో, ప్రైవేటు విభాగాలలో 10 మందికి మించి శ్రామిక మహిళలు పనిచేస్తున్న అన్ని రంగాలలో అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. నవంబర్ నెల తర్వాత ఎక్కడికక్కడ ఆకస్మిక తనిఖీలు చేస్తామని, అంతర్గత కమిటీలు లేకుంటే కఠినంగా శిక్షించడానికి వెనుకాడబోమని ఆయన హెచ్చరించారు.



శ్రామిక మహిళల సమస్యలను వివరిస్తున్న కందారపు మురళి

ఇఎస్ఐ ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు మెరుగు : ఎంపి

తిరుపతి సిటి : తిరుపతి ఇఎస్ఐ ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలను మెరుగు పరిచేందుకు ఆదేశాలు జారీ అయ్యాయని ఎంపి గురుమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఎంపి మద్దిల గురుమూర్తి ఆకస్మిక తనిఖీల్లో భాగంగా ఇఎస్ఐ ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా మౌలిక సదుపాయాలు మెరుగుపరచాల్సిన ఆవశ్యకతను గుర్తించి కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళ్లారు. యాభై పడకల ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా మార్చడం, శస్త్ర చికిత్సల విభాగం, ప్రయోగశాల, అధునాతన చికిత్సా పరికరాలు, ఆస్పత్రి సిబ్బంది కోసం నివాసాల నిర్మాణం, తాగునీటి సదుపాయం, సిబ్బంది నియామకాలు చేపట్టాలని కోరారు. స్పందించిన మంత్రిత్వ శాఖ సెక్రటరీ ఆర్తి ఆహుజ మౌలిక సదుపాయాలు మెరుగు పరచాలని విజయవాడలోని ప్రాంతీయ ఇఎస్ఐ కార్యాలయానికి ఆదేశాలు జారీ చేశారు.

జనసేన బహిరంగ చర్చకు రావాలి : వైసిపి

తిరుపతి (మంగళం) : జనసేన నేత కిరణ్‌రాయల్ బహిరంగ చర్చకు వస్తే అతని బండారం బయట పెడతానని, లేనిపక్షంలో గుండు కొట్టించుకుని గాడిద మీద ఊరేగుతానని వైసిపి నేత పసుపులేటి సురేస్ సవాల్ విసిరారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి స్థాయి మరచి కిరణ్‌రాయల్ మాట్లాడటం పట్ల నిప్పులు చెరిగారు. మరోసారి స్థాయి మరచి మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో బలిజ నేతలు సురేష్, అనీల్‌రాయల్, శ్రీను, చక్రి పాల్గొన్నారు.

అభివృద్ధిపై మాట్లాడండి :జనసేన

వెంకటగిరి రూరల్ : రాష్ట్ర అభివృద్ధి గురించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాట్లాడకుండా జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ చేసుకున్న పెళ్లిళ్ల గురించి మాట్లాడటం సరైంది కాదని ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు గూడూరు వెంకటేశ్వర్లు అన్నారు. సామర్లకోటలో ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. పవన్‌కల్యాణ్ చేసుకున్న పెళ్లిళ్లు ఏమన్నా రాష్ట్రాభివృద్ధికి అడ్డు పడుతున్నాయా? అని ప్రశ్నించారు. జగన్ హయాంలో అప్పులు తప్ప అభివృద్ధి లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ నిధులు ఏమయ్యాయో బహిరంగసభలో చెప్పగలరా? అని సవాల్ విసిరారు.

పిసిసి కార్యదర్శులుగా సుప్రజ, చిట్టిబాబు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శుల జాబితాను ఎంపీ కెసి వేణుగోపాల్ ప్రకటించారు. తిరుపతి పట్టణానికి చెందిన సుప్రజ దేవరాజుల, కాంగ్రెస్ పార్టీలో కీలకంగా ఉన్న గౌడపేరు చిట్టిబాబును పీసీసీ ప్రధాన కార్యదర్శులుగా అధిష్టానం ఎంపిక చేసింది. ఈ ఎంపిక పట్ల సుప్రజ, చిట్టిబాబు సంతోషం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా నిలుస్తూ 2024 ఎన్నికల్లో దేశాన్ని విచ్ఛిన్నం చేసే విధానాలను అవలంబిస్తున్న భారతీయ జనతా పార్టీని ఓడించి కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి శాయశక్తులా కషి చేస్తామని హామీ ఇచ్చారు.

అంబేద్కర్ భారీ విగ్రహం ఏర్పాటు చారిత్రాత్మకం : మంత్రి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 125 అడుగుల భారీ విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేయడం చారిత్రాత్మకమని రాష్ట్ర సాంఘిక శాఖ మంత్రి మెరుగు నాగార్జున తెలిపారు. అంబేద్కర్ విగ్రహ కమిటీ చైర్మన్గా, తిరుపతి ఎస్సి నాయకులతో కలిసి విగ్రహ ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా 80 అడుగుల పెడస్టల్, దానిమీద 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం నిర్మించడం భారతదేశంలోనే ఒక చరిత్రని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, డాక్టర్ ఎలమంచి ప్రవీణ్, గండికోట రాజేంద్ర కుమార్ ,సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





విలేకరుల సమావేశంలో ఎంఎల్ఏ వెలగపల్లి వరప్రసాద్

అధికారులు నిబంధనల మేరకు పనిచేయాలి

ఆర్డీవోపై ధ్వజమెత్తిన ఎమ్మెల్యే వెలగపల్లి

ప్రజాశక్తి - గూడూరు టౌన్

ప్రభుత్వాధికారులు నిబంధనలకు లోబడి పని చేయాలని, గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ పై అనేక ఆరోపణలు రావడంతో ప్రభుత్వానికి ఫిర్యాదు చేశామని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని సొసైటీ లోని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. అధికారులకు కొన్ని నిబంధనలు ఉంటాయని, వాటి ప్రకారం ముందుకు వెళ్లాలని సూచించారు. గూడూరు ఆర్డీవో పై పలు ఫిర్యాదులు వచ్చాయని వీటిపై ముఖ్యమంత్రికి లేఖ రాశామని తెలిపారు .వైసీపీ ప్రభుత్వంలో ఎక్కడ అవినీతి జరిగినా సహించేది లేదని, ప్రజలను ఏ కార్యాలయంలో అయినా డబ్బులు డిమాండ్ చేస్తే తమ దష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ యమునమ్మ, నాయకులు కోడూరు మీరా రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, మంజుల , మన్యం శ్రీనివాసులు ,అశోక్, నరసయ్య, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన



తిరుపతి సిటి : స్విమ్స్ మెడికల్ అంకాలజీ విభాగం ఆధ్వర్యంలో బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్విమ్స్ సంచాలకులు ఆర్‌వి కుమార్, అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ భార్గవి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ నెలలో క్యాన్సర్ అవగాహనా నెలగా గుర్తించి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. బ్రెస్ట్ క్యాన్సర్ బారిన పడిన రోగులకు మద్దతుగా నిలబడి వారికి మనోధైర్యాన్ని నింపుతున్నట్లు చెప్పారు. మహిళలు ఎక్కువగా బ్రెస్ట్ క్యాన్సర్ బారిన పడి చనిపోతున్నారని, మొదటిదశలో గుర్తించడం ద్వారా పూర్తిగా నయం చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రవితేజ, ఆదిత్య, కీర్తన, మౌర్యరెడ్డి, నర్సింగ్ డిప్యూటీ డైరెక్టర్ ప్రభావతి పాల్గొన్నారు.

29 న 'చలో గుంటూరు' : దూదేకుల ముస్లీం సంక్షేమ సంఘం

తిరుపతి (మంగళం) : నూర్బాష్ / దూదేకుల సంఘం ప్రధాన సమస్యలపై ఈనెల 29న చలో గుంటూరు కు పిలుపునిచ్చామని, తమ కులస్తులంతా ఈ సింహ గర్జనను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ నూర్బాష్ దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మస్తానమ్మ పిలుపునిచ్చారు. తిరుపతి ప్రెస్ క్లబ్ లో మీడియా ముందు ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షల మంది జనాభా తాము కలిగి ఉన్నామన్నారు. ఇప్పటివరకు చట్టసభలలో అడుగుపెట్టడంలో విఫలమయ్యా మన్నారు. వైకాపా ప్రభుత్వం వచ్చాక ఇప్పుడిప్పుడే తమ వారు ఎదగడం మొదలైందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో వల్లి , షరీఫ్ , రామతుల్లా , రంగనాయక లు పాల్గొన్నారు.

15 నుంచి దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు

తిరుపతి (మంగళం) : కొత్త వీధిలోని శ్రీ కన్యక పరమేశ్వరి దేవస్థానం ఆలయంలో ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు శ్రీ కన్యకా పరమేశ్వరి దేవి శరన్నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ పాలకమండలి సభ్యులు దిండుకుర్తి నరసింహులు , పామిడి సత్యనారాయణ , మహేష్ , శ్రీధర్ , లక్ష్మణ్ , శ్రీరాములు ,రామ్మూర్తి , సురేష్ , సుబ్బారావు తెలిపారు. తిరుపతి ప్రెస్క్లబ్లో శుక్రవారం మీడియా ముందు వీరు మాట్లాడుతూ. ఈ ఉత్సవాలలో మొదటిసారిగా ఎంఆర్ పల్లి లోని పంగులూరు సీతమ్మ భూములలో నిర్మించబోవు నూతన ఆలయ ప్రాంగణానికి అమ్మవారి విగ్రహాన్ని ఉత్సవంగా తీసుకెళ్తామన్నారు. అలాగే భక్తులకు బాసర కంకణాలను ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు.

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

శెట్టిపల్లి గ్రామంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

శెట్టిపల్లి గ్రామంలో పారిశుధ్య లోపంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు తిరుపతి నగరపాలక సంస్థ అధికారులు స్పందించి పారిశుధ్య పనులను చేపట్టారు. చెత్త దిబ్బలు, పందుల స్వైర విహారం, దోమల బెడదతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ ఆర్.శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ రెడ్డి ఆదేశంతో కార్పొరేషన్ శానిటేషన్ విభాగ సిబ్బంది హుటాహుటిన శెట్టిపల్లి గ్రామానికి చేరుకుని అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను పరిశుభ్రం చేశారు. స్థానిక ప్రజలు చెత్త వేయడానికి వీలుగా మూడు ప్రాంతాల్లో చెత్తకుండీలను ఏర్పాటు చేస్తామని అధికారులు ఈ సందర్భంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో శెట్టిపల్లి పంచాయతీ వైఎస్‌ఆర్‌సిపి అధ్యక్షుడు బత్తినబాబు, గౌరవ అధ్యక్షుడు బాలమురళీకష్ణ, సిద్దుయాదవ్, శివయాదవ్, గంగుయదవ్, అనియాదవ్, శానిటరీ సూపర్వైజర్ సుమతి పాల్గొన్నారు.



29న వేమన విజ్ఞాన కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తిరుపతి నగరంలో నూతనంగా రూపుదిద్దుకుంటున్న వేమన విజ్ఞాన కేంద్రం ప్రారంభానికి సిద్ధమవుతోందని ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున తెలిపారు. ఈ నెల 29న వేమన విజ్ఞాన కేంద్రం ప్రారంభం సందర్భంగా ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ తెలుగు ప్రజలకు ప్రాత్ణస్మరనీయుడు వేమనని, సమాజంలోని రుగ్మతలపై అక్షరాన్ని పద్యరూపంలో ఝుళిపించిన మహనీయుడని, మన కన్నా 350 ఏళ్ల ముందు జీవించిన వేమన నాడు రాసిన పద్యాలు నేటికీ మన నాలుకలపై నాట్యం చేస్తున్నాయంటే అప్పటి పరిస్థితులు ఇప్పటికీ మారకుండా కొనసాగుతున్నాయన్నారు. అందుకే వేమన సమకాలీన కవి అని తెలిపారు. అలాంటి వేమన పేరుతో తిరుపతి నగరంలో విజ్ఞాన కేంద్రం పని చేస్తూ, ఇప్పటికే పలు సామాజిక కార్యక్రమాలలో చురుకైన పాత్ర నిర్వహిస్తోందన్నారు. తిరుపతి బాలోత్సవం పేరుతో తిరుపతి జిల్లాలోని వేలాది మంది విద్యార్థులలో వేమన దృక్పథాన్ని పరిచయం చేసింది. కరోనా సమయంలో ఐసోలేషన్ కేంద్రాన్ని నడిపి ఆదుకుంది. ఓ గ్రంథాలయాన్ని, ఆరోగ్య సలహా కేంద్రాన్ని నడుపుతున్నదని గుర్తు చేశారు. ఈ విజ్ఞాన కేంద్రం ప్రజల్లో శాస్త్రీయ భావనలకు తోడ్పడే సాధనంగా కృషి చేస్తుందని తెలిపారు. తిరుపతిలో వేమన విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ భవనాన్ని సమకూర్చుకుందని పేర్కొన్నారు. ఇందులో రెండు సభా మందిరాలు ఏర్పాటు చేశామన్నారు. యశోదనగర్‌లో నూతనంగా రూపొందించిన ట్రస్ట్ భవనాన్ని ఈ నెల 29వ తేదిన ప్రారంబించనున్నట్లు వెల్లడించారు. ప్రముఖ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత ఆచార్య రాచపాళెంచంద్రశేఖర్‌రెడ్డి భవనాన్ని ప్రారంభిస్తారని, ముఖ్యఅతిథిగా ప్రముఖ పాత్రికేయులు, విశ్లేషకులు తెలకపల్లి రవి, సమతా సావప్నికుడు వేమన పుస్తకావిష్కరణకు ఆవిష్కర్తగా మాజి ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం హాజరవుతారన్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు వేగవంతంగా సిద్ధమవుతున్నాయని వెల్లడించారు. ఇప్పటికే లైటింగ్స్, పెయింటింగ్స్ తదితర పనులు పూర్తయ్యాయని, ఆలంకరణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. భవన ప్రారంభానికి సాహితీ ప్రేమికులు, సమాజ శ్రేయోభిలాషులు అందరూ తప్పక రావాలని కోరారు.



త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి: ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే వరప్రసాద్ రావు అధికారులను సూచించారు. గూడూరు పట్టణం సొసైటీలోని ఎమ్మెల్యే వరప్రసాద్ రావు నివాసంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదవాడి సొంత ఇంటి కల నిజం చేస్తూ అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం ఇంటి స్థలాలు మంజూరు చేసింది అనే ఇళ్ల ప్రభుత్వమే నిర్మించి ఇవ్వనున్నారు. నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం 43 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని, ఇంకా ఇంటి నిర్మాణం చేపట్టని వారు ఉంటే వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు. సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోలేని వారు తెలిపితే ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఈ సమావేశంలో ఏఎంసి చైర్మన్ యమునమ్మ, నాయకులు మీరా రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, యూరం మంజుల, మన్యం శ్రీనివాసులు, అశోక్, నరసయ్య, గోవర్ధన్ పాల్గొన్నారు.

అంబేద్కర్ గురుకులం సమీపంలో మద్యం షాపు ఏర్పాటు నిర్ణయం మార్చుకోవాలి..



స్కూలు వద్ద ఆందోళన నిర్వహిస్తున్న ప్రజలు

ప్రజాశక్తి -కోట : నూతనంగా గురుకుల పాఠశాల సమీపంలో మద్యం షాపు ఏర్పాటు నిర్ణయాన్ని సంబంధిత అధికారులు మార్చుకోవాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా శుక్రవారం కోట మండలంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులాలకి సమీపంలో ల్యాండ్ మార్క్ గా ప్రభుత్వ వైన్ షాప్ ఏర్పాటుకు చేస్తున్న సన్నాహాలను తక్షణమే మానుకోవాలన్నారు. పాఠశాల పక్కనే మద్యం షాపు ఏర్పాటు చేస్తే తమ పిల్లల పరిస్థితులు దారుణంగా మారుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల విద్యార్థులు (యువన దశలోవున్న విద్యార్థులు) మద్యానికి అలవాటుపడి చెడు వ్యసనాలకు లోనయ్యే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా పిల్లలు భవిష్యత్తును దృష్టిలో వుంచుకుని ఉన్నతాధికారులు, నాయకులు మద్యం షాపు ఏర్పాటు ఆలోచన ఉపసంహరించుకోవాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయంపై సెబ్ (ఎక్సైజ్) డిపో సీఐ కిషోర్‌ని ఫోన్లో వివరణ అడగగా గురుకుల పాఠశాల సమీపంలో 300 మీటర్ల దూరంలో మద్యం షాపు ఏర్పాటుకు స్థలం పరిశీలించడం వాస్తవమే రెండు, మూడు రోజుల్లో నివేదికను సిద్ధం చేసి పై స్థాయి సంబంధించిన అధికారులకు పంపుతామని తెలిపారు.

సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి: కమిషనర్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: సీజన్ వ్యాధులు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పురపాలక సంఘం కమిషనర్ కెవిఎం ఎన్ రెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని దాసరిగుంట, రాచపాలెం, సత్యనారాయణ కాలనీ, లక్ష్మీనగర్, సచివాలయాల పరిధిలోని శానిటరీ ఇన్స్పెక్టర్ వై బాల నరసింహ, వార్డు సచివాలయ శానిటేషన్ సెక్రెటరీ, హెల్త్ సెక్రెటరీలు పట్టణ ప్రజల ప్రజారోగ్య దృష్ట్యా సీజనల్ వ్యాధుల నిర్మూలన నిమిత్తం, దోమల బెడద నివారణకు క్రిమి సంహారక మందులను పిచికారి చేశారు. పట్టణ ప్రజలు తమ ఇళ్లలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తపడి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల బారిన పడకుండా పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు.

వ్యక్తిగత జీవితంపై విమర్శలు సిగ్గుచేటు: జనసేన

ప్రజాశక్తి -గూడూరు రూరల్: సీఎం జగన్ మోహన్ రెడ్డి సభ్యత సంస్కారాలు మరిచి మహిళలను కించపరుస్తూ పవన్ కళ్యాణ్ వ్యక్తిగత జీవితంపై విమర్శలు చేయడం సిగ్గుచేటని ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ అన్నారు. గూడూరు జనసేన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల పాలనలో జగన్ సీఎం హోదాలో దాచుకోవడం, దోచుకోవడం, దాడులు చేయడం తప్ప అభివృద్ధి ఏమి లేదన్నారు. పవన్ కళ్యాణ్ చట్ట బద్ధంగా చేసుకున్న పెళ్లిళ్ల వల్ల రాష్ట్రానికి ఇలాంటి నష్టం లేదన్నారు. దీనిపై విమర్శలు తగవన్నారు. అనంతరం పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పెద్దిశెట్టి ఇంద్రవర్ధన్, కుందర్తి నాగార్జున, బీసీ విభాగం అధ్యక్షులు చిలకపాటి స్వరూప్ లు మాట్లాడుతూ వ్యక్తిగత విమర్శలు మానుకుని వైఎస్ వంశ పూర్తి చరిత్రను పోస్ట్ రూపంలో రాష్ట్ర ప్రజలకు తెలుపుతామన్నారు. ఈ సమావేశంలో ఈ పార్టీ పట్టణ ఉపాధ్యక్షులు యనమల విజయ్, ప్రధాన కార్యదర్శి బట్టికాల వంశీ కృష్ణ, సాయి, మోహన్ పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఏపీ ఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ గూడూరు పట్టణంలో ని రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో గూడూరు డివిజన్ స్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా గూడూరు డివిజనల్ అధ్యక్షులుగా వెంకటేశ్వర్లు, డివిజనల్ సెక్రటరీగా సిహెచ్ శ్రీనివాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, ట్రెజరర్ గా కోటయ్యను ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా రీజినల్ సెక్రెటరీ అనిల్ కుమార్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని పేద వర్గాలకి అవసరమైన విద్య ఆరోగ్యాన్ని అందించే విషయంలోనూ ఇళ్ల నిర్మాణంలోనూ ఇప్పటి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు ఎంతో మేలు చేసిందన్నారు. డిప్యూటీ జనరల్ సెక్రెటరీ రమేష్ బాబు మాట్లాడుతూ జిల్లాలోని ఎస్సీ ,ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల బలమైన గొంతుకగా ఉండాలన్నారు. నిరుపేదలైన ఎస్సీ ,ఎస్టీల అభివృద్ధి జరగాలంటే ప్రైవేట్ రంగంలో కూడా రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు , పాల్గొన్నారు.

హెల్త్ క్లినిక్ సెంటర్ల అద్దె చెల్లించలేకపోతున్నాం..
ఎమ్మెల్యేకు ఎంఎల్ హెచ్‌పిలు వినతి



ఎమ్మెల్యేకు వినతి తెలుపుతున్న మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్

ప్రజాశక్తి -కోట : మండల పరిధిలోని హెల్త్ క్లినిక్ సెంటర్ లకు అద్దె చెల్లించలేకపోతున్నామని కోట సచివాలయం పరిధిలోని పలువురు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్) గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు ముందు మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే తో వారు మాట్లాడుతూ అద్దె రూములలో ఉంటూ పలు రకాలుగా సేవలు చేస్తున్నామని, తమకు వచ్చే కొద్దిపాటి వేతనంలో అద్దెకు ఉండే హెల్త్ క్లినిక్ సెంటర్‌లకు అద్దెలు కలిసి ప్రతినెలా అద్దె చెల్లించడం కష్టతరంగా ఉందని తెలిపారు. అంతేకాకుండా త్వరలోనే తమకు న్యాయం జరిగేలా చూడాలని తమ గోడును ఎమ్మెల్యే ముందు వెళ్లబుచ్చుకున్నారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి న్యాయం చేస్తామని వారికి హామీ ఇచ్చారు.

మాతా పరమేశ్వరి ఆలయ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి -నాయుడుపేట: నాయుడుపేట అగ్రహారం పేటలోని మాతా పరమేశ్వరి ఆలయ హుండీ లెక్కింపు గ్రామ పెద్దల సమక్షంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. పదివేల రూపాయలు ఆదాయం వచ్చిందని వివరించారు. ఈ నెల 13వ తేదీ గ్రామస్తులందరూ కలిసి జాతర ఖర్చుల వివరాలు చూసి రూ.13,51,099 గ్రామంలో, దాతల నుండి రాగా, రూ.12,35,100 జాతర ఖర్చులుగా తేల్చారు. మిగిలిన రూ.1,16,000 డబ్బును హుండీ ఆదాయం 10వేలు కలిపి కౌన్సిలర్ దారా రవి, ఎస్సీ సెల్ టౌన్ అధ్యక్షులు కటకం జయరామయ్య సమక్షంలో లక్ష 26వేల రూపాయలను గ్రామ పెద్ద మొండెం రత్నయ్య, పెద గొల్ల ఆత్మకూరు నటరాజులకు అందించారు. ఈ కార్యక్రమంలో టీచర్ పాలెటి చంద్రయ్య, హోంగార్డు వీరరాఘవులు, మొండెం బాబు, మంగలపూరి శీనయ్య, చెంగయ్య, కటకం శివ, మొండెం చిన్ని కృష్ణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య స్కూల్లో దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలోని బైరాగి పట్టడలో గల శ్రీ చైతన్య స్కూల్ ఐపీఎల్ బ్రాంచ్ లో శుక్రవారం దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పిల్లలు వివిధ దేవి అమ్మవారి వేషధారణలో అలరించారు. కుల మత భేదం లేకుండా పిల్లల్లో అన్ని రకాల పండుగల ప్రాముఖ్యతను తెలపడానికి ప్రిన్సిపల్ అన్నపూర్ణ తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

సంస్కృతి, సంస్కారానికి నెలవు టీటీడీ విద్యాసంస్థలు : టిటిడి డిఇఓ



ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యార్థినులకు చదువుతోపాటు సంస్కారం, సంస్కృతి, సంప్రదాయాలు నేర్పించడంలో టీటీడీ విద్యాసంస్థలు ఎల్లప్పుడూ ముందుంటాయని టిటిడి విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎం భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో విద్యార్థి సంఘ ప్రారంభోత్సవం కళాశాల అధ్యక్షులు డాక్టరు సి భువనేశ్వరిదేవి అధ్యక్షతన అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన తో ప్రారంభించి, విద్యార్థి సంఘం నాయకులచే ప్రమాణ స్వీకారం చేయించిన అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల కార్యక్రమాలను, దిన చర్యలను, అభివృద్ధి గురించి వివరించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన టిటిడి విద్యాధికారి డాక్టర్ ఎమ్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న 33 విద్యా సంస్థలు చైర్మన్ ఈవో, జేఈవో, చొరవతో ప్రగతి పథంలో దూసుకెళుతున్నాయన్నారు. శ్రీ పద్మావతి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డా.భువనేశ్వరి ఆధ్వర్యంలో అన్ని రంగాల్లో అదే బాటలో పయనిస్తోందని, టిటిడి విద్యాసంస్థలు చదువుతోపాటు సంస్కారం, దైవచింతన కల్పిస్తున్నాయని, విద్యార్థినులు భయాన్ని పారదోలి ధైర్యంగా కష్టపడే తత్వం అలవర్చుకోవాలని సూచించారు. ఇక్కడ సీటు రావడం మీ అందరి అదృష్టమని, మీకందరికీ అభినందనలని, కళాశాలలో జరిగే ప్రతి విషయాన్ని న్యూస్ లెటర్ రూపంలో ఒక బులిటెన్ గా వెలువరిస్తున్నామని, ముఖ్యంగా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడమే టిటిడి విద్యా సంస్థల విజన్ అన్నారు. ఇంటర్మీ డియట్ కౌమారదశ కనుక నిర్ణయాలను ఆచితూచి తీసుకోవాలని మీ తల్లి దండ్రుల కష్టాన్ని గుర్తించి, అధ్యాపకులతో మీ సమస్యలను పంచు కోవాలన్నారు. ఆర్ట్స్ లో 96శాతం మార్కులు సాధించిన ప్రవల్లికని, 80 శాతం పై మార్కులు సాధించిన ద్వితీయ సంవత్సరం విద్యార్థులను అభినం దించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేశ్వరిమూర్తి సేవలను కొనియాడారు. విశ్రాంత తెలుగు అధ్యాపకులు డాక్టర్ డి.ఎమ్. ప్రేమావతి మాట్లాడుతూ డాక్టరు రాజేశ్వరి మూర్తి సేవలను వివరించారు. అలాంటి వారి స్ఫూర్తితో ముందు కెళ్లాలన్నారు. శ్రీ పద్మావతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మహదేవమ్మ మాట్లాడుతూ విద్యార్థినులు చదువు వల్ల పేదరికం, వివక్ష నుండి బయటపడవచ్చన్నారు. విశ్రాంత ప్రిన్సిపాల్ వేదవతి మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలు ఉన్న విద్యార్థుల్ని ఎన్నిక చేసి అన్ని రంగాల్లో ముందుకెళ్లడానికి విద్యార్థి సంఘం ఎంతో తోడ్పడుతుందని ఈ సంఘం ప్రత్యేకతని తెలిపారు. విద్యార్థినిల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అలరించాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, కార్యాలయ, హాస్టల్ సిబ్బంది, టిటిడి ఇంజినీరింగ్ అధికారులు దామోదరం, ఉదయ్ లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

చట్ట బద్ధత లేని మైనింగ్ వ్యాపారులపై చర్యలు: ఆర్‌డివో



మాట్లాడుతున్న ఆర్‌డివో కిరణ్‌కుమార్

ప్రజాశక్తి -గూడూరు : గూడూరు రూరల్ పరిసర ప్రాంతాల్లో చట్టబద్ధత లేని మైనింగ్ వ్యాపారులపై ర్యలుతీసుకుంటామని ఆర్‌డివో కిరణ్‌కుమార్ హెచ్చరించారు. గురువారం విలేకరులతో మాట్లా డుతూ చట్టబద్ధత లేని మైనింగ్ వ్యాపారుల సమాచారం ఒక మెసేజ్ పెడితే చాలు గూడూరు రూరల్ పరిసర ప్రాంతాల్లోనే తాను తిరుగుతుంటానని ఎక్కడ హిటాచిలు తవ్వుతూ కనిపిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనుమతుల్లేని మైనింగ్ వ్యాపారులు జాగ్రత్తగా వుండాలని హెచ్చరించారు. గూడూరు మండలంలోని అక్రమంగా గ్రావెల్ తెల్లరాయి ఎక్కడపడితే అక్కడ తవ్వి గుంతలు తవ్వుతున్నారని, వీటికి పర్మిషన్ లేకుండా వీళ్ళ ఇష్టానుసారం గుంతలు తవ్వి పర్యావరానికి ఇబ్బందికి గురి చేస్తున్నారని, ఈ విషయం ఆర్డీవో కిరణ్ కుమార్ దృష్టికి వెళ్లడంతో ఆయన దీని మీద ఉక్కుపాదం మోపాలని నిర్ణయించుకున్నారు. అక్రమాలు జరుగుతుంటే అడ్డుకుని వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

దక్షిణ కోరితే కఠిన చర్యలు: ఈవో

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో విధులు నిర్వహించే పూజారులు, అర్చకులు, ఆలయ సిబ్బంది భక్తుల నుంచి దక్షిణ డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆలయ ఈవో కె.వి సాగర్ బాబు హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఈవో ఒక ప్రకటన జారీ చేశారు. విధులు నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది ఖచ్చితంగా యూనిఫాం ధరించి సంప్రదాయాలను పాటించాలని ఆదేశించారు. ఈ ఆదేశాలను అధిక్రమించిన ఆలయ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించా రు. క్యూలైన్ల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలనీ, సెల్ఫోన్ కౌంటర్లో అధిక రుసుం వసూలు చేయకూడదన్నారు. అన్నదాన కార్యక్రమం కూడా సక్రమంగా నిర్వహించాలని, దర్శనార్థం విచ్చేస్తున్న భక్తులకు క్యూలైన్లో తాగునీరు ఏర్పాటు చేయాలని ఆలయ సిబ్బందికి, సిఎస్ఓకి ఆదేశాలు జారీ చేశారు.

ముందస్తు దసరా వేడుకలు

ప్రజాశక్తి -ఏర్పేడు : మండలంలోని పాతవీరాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముందస్తుగా దసరా మహోత్సవం వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు భువనేశ్వరి మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలు జాతి మనగడకు పట్టుకొమ్మలన్నారు. బడి పిల్లలకు దసరా సెలవులు కావడంతో ముందస్తు విద్యార్థులందరూ తెచ్చిన బొమ్మలతో బొమ్మల కొలువు నిర్వహించారు. తెలుగు పండితులు డాక్టర్ దేవరాజులు మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి తీపి గుర్తుగా దసరా జరుపుకుంటారని పురాణాలలో లోతైన మహా జ్ఞానం ఇమిడి ఉందని వాటిని నేర్చుకుని నిత్యజీవితంలో ఉపయోగించడం వల్ల పిల్లలందరూ ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మజ, దేవరాజులు, వెంకటేశ్వర్లు, ఉషారాణి పాల్గొన్నారు.

పాఠశాలలు విద్యార్థులను ఉజ్వల భవిష్యత్తులో నడిపిస్తాయి: బొల్లినేని

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్: పాఠశాలలు విద్యార్థులను ఉజ్వల భవిష్యత్తులో నడిపిస్తాయని బొల్లినేని జగన్నాథం నాయుడు అన్నారు. మండలంలోని రాచగున్నేరి పంచాయతీ లోని జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాచగున్నేరి పంచాయతీ మాజీ సర్పంచ్, జె.కె స్టీల్స్ అధినేత బొల్లినేని జగన్నాథం నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మొదటగా ఉపాధ్యాయులు బొల్లినేని జగన్నాథం నాయుడు ను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలలు విద్యార్థులను ఉజ్వల భవిష్యత్తులోకి నడిపిస్తాయని అన్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పే మాటలను శ్రద్ధగా బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అందుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిజ, ఉపాధ్యాయులు మార్టిన్, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

అల్లిమడుగు చెరువును అమ్మేస్తున్న దెవరు?

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం అల్లిమడుగు చెరువును అమ్మేస్తున్న అత్త కొడుకు ఎవరో చెప్పాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణానికి దక్షిణ భాగాన ఉన్న ఇరవై రెండు వేల ఎకరాల విస్తీర్ణం కలిగిన కైలాసగిరి ప్రాంతాన్ని కబ్జా దారులు కబళిస్తుంటే చోద్యం చూస్తున్న శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం అధికారుల తీరు పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. దేవాదాయ శాఖకు చెందిన ప్రభుత్వ భూములను ధారాదత్తం చేస్తున్న అల్లుడు ఎవరో విచారించి, స్వామి వారి భూములను కాపాడాలని నాయకులు డిమాండ్ చేశారు. మిన్నల్ రవి, సుబ్బయ్య, ఖాదర్ బాషా, ఉమేష్ రావు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక





ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఏపీటీఎఫ్ పట్టణ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. స్థానిక బాబు అగ్రహారం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా సురేష్ బాబు, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్, గౌరవాధ్యక్షుడిగా హేమ కుమార్, ఉపాధ్యక్షులుగా హేమ, గోపాల్, హరి నాథ్ ఎన్నికయ్యారు.

లక్ష్మీపతిని పరామర్శించిన గాలి భాను ప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట మండలం వడమాలపేటకు చెందిన లక్ష్మీపతి ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ లక్ష్మీపతి ఇంటికి వెళ్లి పరామర్శించి ప్రమాదానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని మెరుగైన ఆరోగ్యం కోసం డాక్టర్ తో చెప్పి చికిత్స కోసం ప్రయత్నిస్తామని తెలిపారు. ఆయన వెంట టిడిపి నాయకులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతం

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: బిఎన్ కండ్రిగ మండలం విఎస్ పురం సచివాలయ పరిధిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష విజయవంతమైంది. ఈ కార్యక్రమం వైసీపీ మండల అధ్యక్షులు ఆరని విద్యానాథరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జగనన్న సురక్ష లో సచివాలయ అధికారులు, వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు కలిసి ప్రజా సమస్యలను పరిష్కరిస్తుంటే ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని వారి అనారోగ్య సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డివి నరసింహారావు , వైద్య అధికారులు, మాధవి లత, దివాకర్, ఎమ్మార్వో ప్రసాద్, మండల సచివాలయాల కన్వీనర్ అందిన భాస్కర్ రెడ్డి, వైసిపి మండల నాయకులు జొన్నల గోపాల్ రెడ్డి, ఉగ్గుమూడి గురునాథం కేయం రాజా, ఆలతూరు ఎంపీటీసీ కొగిల వరలక్ష్మి, వి ఎస్ పురం సచివాలయం సిబ్బంది కన్వీనర్లు చిలుకూరు గిరి రెడ్డి, కొగిల రమేష్, ఆలగుంట చిన్నికృష్ణ, మండల పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు అతివరం ధర్మయ్య, పీవీ కండ్రి పంచాయతీ సర్పంచ్ యనమల కోటమ్మ, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు, వైసిపి వీడియో కన్వీనర్ ప్రసాద్ పాల్, మండల పార్టీ నాయకులు నలుబోలు నాగార్జున, వార్డ్ మెంబర్లు, గృహ సారథులు, బియన్ కండ్రిగ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉగ్గు మూడి గురునాథం (సంధ్య), ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్వరూప మహా పాదయాత్రను జయప్రదం చేయండి: ఎంఆర్‌పిఎస్



సంఘీ భావ పాదయాత్ర నిర్వహిస్తున్న ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నాయకులు

ప్రజాశక్తి -సత్యవేడు: విశ్వరూప మహా పాదయాత్రను జయప్రదం చేయాలని ఎంఆర్‌పి ఎస్ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి రాగిపాటి రాఘవయ్య మాదిగ కోరారు. మాదిగల విశ్వరూప పాదయాత్రకు సంఘీ భావంగా ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నాయకులు సత్యవేడు మండలం రాజగోపాలా పురంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఆర్‌పిఎస్ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి రాగిపాటి రాఘవయ్య మాదిగ మాట్లాడుతూ వచ్చే శీతాకాల పార్లమెంటు సమావేశంలోనే ఎస్సీ వర్గీకరణకు చట్ట బద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ అభినవ అంబేద్కర్ మాదిగల ముద్దుబిడ్డ మందకృష్ణ మాదిగ అలంపూర్ టు హైదరాబాద్ మాదిగల మహా పాదయాత్రను కొనసాగిస్తున్న సందర్భంగా నవంబర్ లో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని, ప్రతి గ్రామం నుండి చదువుకున్న ప్రతి బిడ్డను ప్రతి అన్నను ఇంటికి తాళం వేసి విశ్వరూపం మహాసభను జయప్రదం చేయాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గం కో కన్వీనర్ యర్రమల్లి గౌరీ భాస్కర్, మహాజన సోషలిస్ట్ పార్టీ నియోజకవర్గ కో కన్వీనర్ ఐతం సుధాకర్ మాదిగ, గ్రామ యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కబ్జా భూముల్లో రెవెన్యూ ఉక్కుపాదం: తహశీల్దారు



ప్రజాశక్తి - ఓజిలి: కబ్జాకు గురైన ప్రభుత్వ భూములలో తహశీల్దారు ఏ. శివరామ సుబ్బయ్య తన రెవెన్యూ సిబ్బందితో ఉక్కు పాదం మోపారు. మండలంలోని మాచవరం సచివాలయం పరిధిలో ఉన్న సర్వే 207 ,226 నెంబర్లో సుమారు మూడు వందల ఎకరాలకు పైగా ప్రభుత్వ మేతపురంబోకు భూమి ఉంది. మేత పురంబోకు భూమిలో కొంతమంది అక్రమంగా ప్రవేశించి 60 ఎకరాల వరకు ఆక్రమించుకుని నిమ్మ సాగు చేయడానికి ప్రయత్నిస్తుండగా రెవెన్యూ సిబ్బంది పలుమార్లు హెచ్చరించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. హెచ్చరిక బోర్డులు తొలగించి మళ్లీ ప్రవేశించడంతో శుక్రవారం పోలీసు బలగాలతో తహశీల్దార్ ఏ.శివరామ సుబ్బయ్య ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూముల వద్దకు చేరుకుని అనుమతులు లేకుండా సాగు చేస్తున్న నిమ్మ మొక్కలను తొలగించారు. సందర్భంగా తహశీల్దార్ ఏ.శివరామ సుబ్బయ్య మాట్లాడుతూ ప్రభుత్వ భూములలో అనుమతులు లేకుండా ఆక్రమించి సాగు చేస్తే అట్టువారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేలు గోపిరెడ్డి, ఆర్ఐ విజయ్ కుమార్, సిఐ వై.వి సోమయ్య , ఎస్ఐ.ఆదిలక్ష్మి ,వీఆర్వోలు, వీఏఓలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రఫీ కుటుంబానికి టిడిపి కొండంత అండ : శాసనమండలి మాజీ చైర్మన్

ప్రజాశక్తి -రామచంద్రాపురం : రాజకీయ కక్షతో టిడిపి మండల మాజీ కోఆప్షన్ సభ్యులు, గ్రామ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ రఫీ ని వైసీపీ నేత అంబారపు ఖాదరవల్లి, అతని కుమారుడు అంబారపు సిద్దిక్ లు హతమార్చడం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి మాజీ చైర్మన్ మహమ్మద్ షరీఫ్ అన్నారు. మహమ్మద్ రఫీ కుటుంబానికి టిడిపి కొండంత అండగా ఉంటుందని పేర్కొన్నారు. అక్రమ కేసులో అరెస్టై రాజమండ్రి జైల్లో ఉన్న మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహమ్మద్ రఫీ హత్య విషయాన్ని తెలుసుకుని, రఫీ కుటుంబాన్ని రాష్ట్ర పార్టీ ఆదుకోవాలని ఆదేశించడంతో శుక్రవారం మహమ్మద్ రఫీ కుటుంబ సభ్యులను బొప్పరాజు పల్లి లో మహమ్మద్ షరీఫ్, చంద్రగిరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మౌలానా, టిడిపి నాయకులు పరామర్శించారు. రఫీ ముగ్గురు కుమారులకు ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఉచిత విద్యను అందిస్తామని, ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించి ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి నియోజకవర్గ టిడిపి నాయకులు ఎన్ చిన్నబాబు, ఎం తిరుమలరెడ్డి, మాజీ ఎంపీపీ డి బిందు మాధవి, జనార్దన్ చౌదరి, ఉమాపతి నాయుడు, కే గిరిధర్ రెడ్డి, సి రవికుమార్, జవ్వాది ప్రకాష్ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

జనసేన వీర మహిళల అరెస్టు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి ప్రెస్ క్లబ్ వద్ద శుక్రవారం కొద్దిపాటి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సీఎం జగన్ పవన్ కళ్యాణ్ మూడు పెళ్లిళ్లు చేసుకున్నారని చేసిన విమర్శలపై జనసేన వీర మహిళలు సీఎంకు గాజులు, చీర ఇస్తున్నామని విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ విలేకరుల సమావేశం సమాచారాన్ని తెలుసుకున్న తిరుపతి ఈస్ట్ పోలీసులు మునుపెన్నడూ లేని విధంగా ప్రెస్ క్లబ్ సమావేశ మందిరంలోకి వచ్చి జనసేన ప్రధాన కార్యదర్శి ఆకెపాటి సుభాషినిని అరెస్టు చేయడానికి ప్రయత్నించడంతో కొద్దిపాటి ఉద్రిక్తత చోటుచేసుకుంది. అనంతరం విలేకరుల సమావేశం ముగిశాక జనసేన వీర మహిళలను పోలీసులు బలవంతంగా పోలీసు జీపులో ఎక్కించి పోలీస్ స్టేషనుకు తరలించారు.

టిడిపి నాయకుల ప్రచారం

ప్రజాశక్తి- యర్రావారిపాలెం: మీ ఇంటికి మీ పులివర్తి నానిలో భాగంగా మండలంలో శుక్రవారం పులివర్తి నాని సతీమణి సుధా రెడ్డి మండల కేంద్రంలో పర్యటించారు. జనసేన, టిడిపి నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం సుధా రెడ్డి మీడియాతో మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు దొంగ ఓట్లు చేర్పించి రానున్న ఎన్నికల్లో గెలవడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. దొంగ ఓట్లు తొలగించాలని సంబంధిత అధికారులకు పదేపదే చెప్పినా ఏమాత్రం పట్టించుకోవడంలేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో న్యాయబద్ధంగా ఓటింగ్ జరిగితే టిడిపి భారీ మెజారిటీతో గెలుపు ఖాయమని హితవు పలికారు. రానున్న ఎన్నికల్లో జనసేన, టిడిపి నాయకులు శక్తి వంచన లేకుండా కష్టపడి టిడిపిని అధికారంలోకి తేవాలని ఇంటింటికి ప్రచారం చేశారు.

క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం గ్రంథాలయం నుంచి యూనివర్సిటీలో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం వరకు టీఎన్ఎస్ఎఫ్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రామకృష్ణ నాయుడు ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వైఎస్ఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడ చూసినా అరాచకాలు, దోపిడీలు, మానభంగాలు వంటివి పెరగడంతో ఆంధ్రరాష్ట్రంలో అప్రజాస్వామిక విధానాలతో ప్రజలు భయాందోళన కు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు పాదయాత్రగా విశ్వవిద్యాలయంలోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామికి 101 కొబ్బరికాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత ఉపాధ్యక్షులు నాగేంద్రబాబు, భీష్మ, రాజు, సోమేశ్, గణేష్, రమేష్, భాను, రామాంజనేయులు, రంగన్న, లవ, పెద్దయ్య, చందుచౌదరి, భీమేష్ పాల్గొన్నారు.

గూడూరు : చంద్రబాబు ని వెంటనే సూపర్ స్పెషాలిటి హస్పిటల్ లో చేర్పించి వారు కోలుకునే వరకు హాస్పిటల్ లోనే ఉంచాలని పార్టీ కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించిన పాశం సునీల్ కుమార్ మాజీ శాసన సభ్యులు మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబుపై అక్రమ కేసులుబనాయించి అన్యాయంగా అరెస్ట్ చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఆయన ఆరోగ్యం క్షీణిస్తే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్ కుమార్, కార్యదర్శి నెలబల్లి భాస్కర్ రెడ్డి, పట్టణం అధ్యక్షులు పులిమి శ్రీనివాస రావు, పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి దువ్వూరు రవీంద్ర రెడ్డి, పార్లమెంట్ క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు తాటాపూడి ఇశ్రాయల్ కుమార్ పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి- వెంకటగిరి రూరల్ : ఆహారంలో భాగంగా సిరి ధాన్యాలను తీసుకోవాలని వీటి వలన ఆరోగ్యంగా ఉంటామని డాక్టర్ వైయస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం సంచాలకులు డాక్టర్ కర్ణ శ్రీ అన్నారు. శుక్రవారం పెరియావరం లో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రాములో చిరుధాన్యాల క్షేత్ర ప్రదర్శనశాలకు విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ తిరుపాల్, డాక్టర్ నాగార్జున రెడ్డి, రాజీవన పాల్గొన్నారు.

ఎస్వీసీఈలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి–కరకంబాడి మార్గంలోని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లో వుయ్ ఆర్ విత్ యు చారిటబుల్ ట్రస్ట్, హెచ్డిఎఫ్‌సి బ్యాంక్, కళాశాల జాతీయ సేవా పథకం సంయుక్తంగా స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. సుధాకర్ రెడ్డి, రుయా హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ హరిత జ్యోతి ప్రజ్వలన చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. స్వచ్ఛంద రక్తదాన శిబిరం ద్వారా 210 యూనిట్ల రక్తాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం అధికారులు చంద్రయ్య, సుజన్ కుమార్, నరేన్ కుమార్, అంజన్ కుమార్ రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ షేక్ రఫీకిరణ్, డాక్టర్ టి. చంద్రశేఖర రావు, శ్రీనివాసులు రెడ్డి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

అపారమైన అవకాశాలను నిరుద్యోగులు అందిపుచ్చుకోవాలి

మెగా ఉద్యోగమేళాలో వైసిపి మండల కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి



ప్రజాశక్తి -సత్యవేడు: నిరుద్యోగులైన యువతీ యువకులు అపారమైన ఉద్యోగ అవకాశాలను అందుపుచ్చుకోవాలని తిరుపతి జిల్లా సత్యవేడు వైసిపి మండల కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రాంగణంలో కళాశాల ప్రిన్సిపాల్ ఉషాదేవి అధ్యక్షతన జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ మేనేజర్ శ్యామోహన్ ఆధ్వర్యంలో మెగా ఉద్యోగమేళా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ బాబు, స్థానిక స్కిల్ హబ్ కోఆర్డినేటర్ చైతన్య చక్రవర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా వైసిపి మండల కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ చదువుకొని నిరుద్యోగులైన వారందరికీ ఉద్యోగాలు కల్పించాలన్న ఉద్దేశంతో తరచూ ఈ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే నిరుపేదలైన విద్యార్థులు వారు చదువులను మధ్యలో మానేయకుండా కొనసాగించడానికి అమ్మ ఒడి లో విద్యార్థుల తల్లుల ఖాతాలోకి ప్రభుత్వం సొమ్మును జమ చేస్తున్నట్టు ఆయన చెప్పారు. ఇదేగాక గత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనూ ఉన్నత చదువుల కోసం ఫీజు రీయింబర్సుమెంట్ ప్రవేశ పెట్టారని, కార్పొరేట్ విద్యాలయాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను నాడు నేడు లో తీర్చి దిద్దిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి దక్కిందన్నారు. గత ఏ ప్రభుత్వంలోనూ విద్యా రంగానికి ఇంత భారీ స్థాయిలో నిధులను వెచ్చించిన దాఖలాలు లేవన్నారు. చదువు పూర్తయిన తర్వాత వారిలో నైపుణ్యాన్ని పెంచడానికి స్కిల్ హబ్‌లు ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ బాబు మాట్లాడుతూ వారి వారి విద్యా అర్హతకు తగ్గట్టు ఉద్యోగాలు ఇవ్వడానికి పరిశ్రమల యాజమాన్యాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. అయితే కొందరు అభ్యర్థులు పరిశ్రమంలో చేరిన వారానికే నిలిచి పోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రధానంగా ఉత్పత్తి రంగానికి సంబంధించిన పరిశ్రమల్లో ఉద్యోగాలు చేరే కొత్త వారు వారి నైపుణ్యాన్ని పెంచుకోగలిగితే అందుకు తగ్గట్టు వేతనాలు ఇవ్వడానికి కూడా పరిశ్రమలు వెనుకంజ వేసే ప్రసక్తి లేదన్నారు. ఈ ఉద్యోగమేళాలో శ్రీజ మహిళా మిల్క్, ముత్తూట్ గ్రూప్, వీల్స్ ఇండియా, డైకిన్ ఎయిర్ కండిషన్, హీరో మోటార్ కంపెనీ, బ్లూస్టార్ తదితర 17 కంపెనీలకు సంబంధించిన ప్రతినిధులు పాల్గొన్నారు. వీరందరూ నిరుద్యోగులైన అభ్యర్థులతో ఇంటర్వ్యూ నిర్వహించారు. మేళాకు 221 మంది హాజరు కాగా ఇందులో 182 మంది సెలెక్ట్ అయినట్టు స్థానిక స్కిల్ హబ్ ఇన్‌చార్జ్ ప్రకాష్ నారాయణ పేర్కొన్నారు. వీరికి వెంటనే పారిశ్రామిక ప్రతినిధులు నియామక పత్రాలు అందించారు. ఈ మెగా జాబ్ మేళాలో పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఉషాదేవి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ మేనేజర్ మురళి, ప్లేస్‌మెంట్ అధికారి గణేష్, వైసిపి నాయకులు శ్రీధర్ రెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు శ్యామ్ అరవింద్, హన్న, హరి ప్రసాద్, మురళీమోహన్, సుధాకర్, రవిశంకర్, పలువురు నిరుద్యోగమైన యువతి యువకులు పాల్గొన్నారు.